ప్రజాశక్తి

శనివారం 18 నవంబర్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

అంతటా కరువే..!

◆ అయినా కనికరం చూపని ప్రభుత్వం ◆ సర్కారు విస్మరణపై రైతు విస్మయం

◆ నేటి జెడ్‌పి సమావేశంపై ఎన్నో ఆశలు

◆ ఉమ్మడి విశాఖను కరువు ప్రాంతంగా ప్రకటించేలా తీర్మానం చేయాలని డిమాండ్

ఇటీవల నక్కపల్లిలో ఎండిన వరి పైరుతో నిరసన తెలుపుతున్న రైతులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో కరువు తీవ్రత ఎక్కువగా వుంది. వర్షాభావంతో రైతుకు పెట్టుబడులూ చేతికిరాని పరిస్థితి దాపురించింది. ఖరీఫ్‌లో పంట నమోదు నుంచి దిగుబడుల వరకు పరిస్థితులు ఆశాజనకంగా లేవు. కరువు ప్రకటనకు అర్హత కలిగిన మండలాలనూ ప్రభుత్వం విస్మరించింది. కరువుతో నష్టపోయిన రైతును ఆదుకుంటామన్న భరోసా ఇవ్వలేకపోయింది. ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు తమకేమీ రైతు సమస్యలు, కరువు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. శనివారం జరగనున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనైనా చర్చించి ఉమ్మడి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని రైతులు కోరుతున్నారు.

అనకాపల్లి జిల్లాలోని 24 మండలాల్లో మిగతా 2లో..

ప్రజా సమస్యలను లేవనెత్తుతా : సిపిఎం జెడ్‌పిటిసి గంగరాజు

'ఏజెన్సీలో నాన్‌షెడ్యూల్ గ్రామాల్లో గిరిజనుల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. గిరిజనుల భూములకు రక్షణ కల్పించాల్సివుంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాను కరువుగా ప్రకటిస్తూ తీర్మానం చేయాలి. భాషా వాలంటీర్లకు కనీస వేతనం అమలు చేయాలి. విద్యుత్, రహదారుల సౌకర్యంలేని గ్రామాలపై దృష్టి పెట్టాలి. వలసలు నిరోధించేందుకు ఉపాధి పనులు కల్పించాలి. పాడేరు నుంచి విశాఖపట్నం వచ్చే రహదారికి మరమ్మతులు చేపట్టి, ప్రమాదాలు నివారించాలి. ఈ అంశాలు చాలా కీలకం. వీటిని సమావేశంలో లేవనెత్తుతా' అని అనంతగిరి సిపిఎం జెడ్‌పిటిసి సభ్యులు డి.గంగరాజు తెలిపారు.

ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద బారులు తీరిన క్రీడాభిమానులు

టి-20 టికెట్లు అమ్మకం ప్రారంభం

ఆఫ్‌లైన్ కౌంటర్లు వద్ద బారులు తీరిన క్రీడాభిమానులు వార్త మెయిన్‌లో..

ఎయు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చినవాల్తేర్ సమీపంలోని ఎయు అవుట్ గేట్ వద్ద శుక్రవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. దీనిలో కశ్యప్ జూనియర్ కాలేజీకి చెందిన ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతిచెందారు. ట్రాఫిక్ ఎడిసిపి జి.శ్రీనివాసరావు కథనం మేరకు శుక్రవారం సాయంత్రం 7:10 గంటలకు అవుట్ గేట్ నుంచి బయటికి వస్తున్న ద్విచక్ర వాహనం అటుగా వెళ్తున్న కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని ఢీకొనడంతో ప్రమాదం మిగతా 2లో..

సందర్శకులతో విశాఖ జూ కిటకిట

▶ వార్త 4లో..

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం

▶ వార్త 4లో..

కార్మిక, రైతు మహాధర్నాను జయప్రదం చేయండి

▶ వార్త 2లో..

పంచ గ్రామాల్లో..

ఇళ్ల మరమ్మతులు, నిర్మాణాలకు అనుమతివ్వాలి

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పంచ గ్రామాల ప్రజలకు ఎటువంటి షరతులూ పెట్టకుండా ఇళ్ల మరమ్మతులు, నిర్మాణాలను అనుమతించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నిలిపివేసిన రిజిస్ట్రేషన్లు, క్రయవిక్రయాలను పునరుద్ధరించాలన్నారు. పంచ గ్రామాల భూముల్లో ఇళ్ళ రిపేర్లకు షరతులతో కూడిన అనుమతి ఇవ్వడానికి సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు అధికారమిస్తూ రాష్ట్ర వైసిపి ప్రభుత్వం మెమో జారీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పంచ గ్రామాల భూ వివాదం హైకోర్టులో 23 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందన్నారు. ఆ భూమిపై హక్కులు ఎవరివి అన్నది నేటికీ కోర్టు తీర్పు వెలవడలేదన్నారు. కానీ విశాఖ ఆర్‌డిఓ ఆర్డర్, జిల్లా జాయింట్ కలెక్టర్‌తో కూడిన ముగ్గురు ఉన్నతాధికారుల కమిటీ రిపోర్టులు దేవస్థానానికి ఆనాటి తహశీల్దార్లు మొత్తం భూమిని దఖలు పరుస్తూ ఇచ్చిన పట్టాలు సక్రమం కాదని తేల్చి చెప్పారన్నారు. అందువల్ల ఈ భూమి సింహాచలం దేవస్థానందే అనడానికి ఎటువంటి ఆధారాలూ లేవన్నారు. హైకోర్టు తీర్పు వెలువడేలోగా ఇళ్ల రిపేర్లు, నిర్మాణాలకు అనుమతించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా నిలిపివేసిన రిజిస్ట్రేషన్లు పునరుద్ధరించాలని పంచ గ్రామాల ప్రజలు పోరాడుతున్నారన్నారు. ఈ పోరాటానికి సిపిఎం అండగా నిలుస్తోందన్నారు. నేడు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో ఆ పోరాట ఫలితమే అన్నారు. దేవస్థానం అధికారికి అనుమతులు మంజూరు చేసే అధికారం ఇవ్వడం అంటే ప్రజలపై జులుం ప్రదర్శించడానికి అవకాశం ఇవ్వడం తప్ప మరొకటి కాదన్నారు. ఇప్పటికే దేవస్థానం అధికారులు స్క్వాడ్‌ల పేరుతో ఈ ప్రాంత ప్రజలపై అమానవీయంగా ప్రవర్తిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇది సమర్థనీయం కాదన్నారు. రాష్ట్ర మిగతా 2లో..

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

వెయిటింగ్ లాంజ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పన ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నామని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ శ్వాసకోస, అంటువ్యాధుల ఆసుపత్రి ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులను ప్రధాన వైద్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆసుపత్రి ప్రాంగణంలో రోగుల సహాయకులు వేచి ఉండేందుకు రూ.10 లక్షలతో నిర్మించిన వెయిటింగ్ లాంజ్, భోజన సదుపాయ గదులను, రూ.17.5 లక్షలతో అభివృద్ధి చేసిన 16 పడకల రెస్పిరేటరీ ఇంటెన్సీ కేర్ యూనిట్లను, నాలుగు లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన ఎబిజి పరీక్షా యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ శ్వాసకోస ఆసుపత్రిలో సుమారు రూ.65 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో మొట్టమొదటిగా సారిగా ప్రభుత్వ ఆసుపత్రుల విభాగంలో విశాఖలో రెండు ప్రభుత్వ ఆసుపత్రులు ఎన్ఎబిహెచ్ గుర్తింపు పొందాయని చెప్పారు. వాటిలో ప్రభుత్వ శ్వాసకోస, అంటువ్యాధుల ఆసుపత్రి, మానసిక రోగుల ఆసుపత్రి ఉన్నాయన్నారు. రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది, వైద్యుల పనితీరు వల్ల ఇది మిగతా 2లో..

కార్మిక, రైతు మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశవ్యాప్త కార్మిక, ఉద్యోగ, రైతు సంఘాల పిలుపు మేరకు విజయవాడలో ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే కార్మిక, రైతు మహాధర్నాకు జిల్లా నుంచి వందలాదిగా కదిలిరావాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు, రైతులకు, ప్రజలకు, దేశానికి వ్యతిరేకమైన వినాశకర కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తోందన్నారు. అటువంటి ప్రభుత్వాన్ని అధికారం నుండి దింపటమే తక్షణ కర్తవ్యమన్నారు. కేంద్రంలో, రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలు ఈ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేయడానికి భయపడే స్థాయిలో కార్మిక, రైతు ఐక్య పోరాటాలు పెరగాలన్నారు. ఈ నేపథ్యంలో విజయవాడలో జరగనున్న మహాధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామస్వామి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, పి.మణి, తులసి, మంగశ్రీ, రాజు, అప్పలరాజు, అనసూయ, సుబ్బారావు, లక్ష్మణమూర్తి, అప్పారావు, జగన్ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

అంతటా కరువే..!

వ్యవసాయశాఖ నివేదిక ప్రకారం జూన్ ఒకటి నుంచి అక్టోబర్ 25 వరకు 881.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సివుండగా 633.1 మిల్లీమీటర్లు నమోదైంది. - 28 శాతం వర్షపాతం లోటు ఉంది. 16 మండలాల్లో తక్కువ వర్షం కురిసింది. ఈ ప్రభావం ఖరీఫ్ పంటలపై పడింది. 2,04,982 ఎకరాల్లో పంటలు వేయాల్సివుండగా, వర్షాభావ పరిస్థితులతో 1,35,167 ఎకరాల్లో రైతులు పంట వేశారు. సాగులో 66 శాతం నమోదైంది. ఇందులో వరి 1,36,460 ఎకరాలకు లక్షా ఆరువేల ఎకరాల్లో సాగైంది. దీంట్లో 50 వేల ఎకరాలకుపైగా పంట రైతు చేతికిరాని పరిస్థితివుంది. ఏజెన్సీలో - 20 శాతం వర్షపాతం లోటువుంది. వరి లక్షా రెండు వేల ఎకరాల్లో సాగుకావాల్సివుండగా 91 వేల ఎకరాల్లో పంట నమోదైంది. విశాఖ జిల్లాలో - 21.4 శాతం వర్షపాతం లోటు వుంది. 13,937 ఎకరాలకు 11,701 ఎకరాల్లో పంట నమోదైంది. దీంట్లో సగానికిపైగా పంట ఎండిపోయిన పరిస్థితులున్నాయి. కరువు ఇంత తీవ్రంగా వున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితుల్లో జిల్లా పరిషత్ సమావేశంలోనైనా వ్యవసాయంపై చర్చించి దెబ్బతిన్న పంటలను పరిగణనలోకి తీసుకొని కరువుగా ప్రకటించాలని తీర్మానం చేయాల్సివుంది. సమావేశపు అజెండాలో ప్రాధాన్యతాంశంగా వ్యవసాయాన్ని పెట్టడంతో తగిన ప్రాధాన్యత సమావేశం ఇస్తుందన్న ఆశ రైతుల్లో వుంది.

ఉపాధి పనుల కల్పన కీలకం

ఏజెన్సీలో వ్యవసాయ పనుల్లేక, ఉపాధి పనులు కరువై గిరిజనులు వలస వెళ్తున్నారు. అనంతగిరి మండలం నుంచి పనుల కోసం గుంటూరు ప్రాంతానికి వలస వెళ్లిన గిరిజనులకు అక్కడ కూలి ఇవ్వకుండా పనులు చేయించడంతో కొంతమంది తప్పించుకొని సొంత గ్రామాలకు చేరుకున్నారు. వలసలు లేకుండా ఉపాధి పనులు కల్పించాల్సిన అవసరం వుంది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరగనున్న సర్వ సభ్య సమావేశానికి ముందు జిల్లా పరిషత్ ఒకటి నుంచి ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరగనున్నాయి. జిల్లా పరిషత్ సమావేశంలో 2023-24 సవరణ బడ్జెట్, 2024-25 అంచనా బడ్జెట్ ఆమోదానికి సభలో ప్రవేశపెట్టనున్నారు.

ఇళ్ల మరమ్మతులు, నిర్మాణాలకు అనుమతివ్వాలి

ప్రభుత్వం తాజాగా జారీ చేసిన మెమోలోని వైరుధ్యాలను జగ్గునాయుడు ఉటంకించారు. జగన్ సర్కారు పంచ గ్రామాల సమస్య పట్ల సరైన అవగాహనతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. తమకు అధికారం ఇస్తే మూడు నెలల్లో పంచ గ్రామాల భూ సమస్య పరిష్కరిస్తామని, ప్రజలకు పూర్తి హక్కులు కల్పించేలా చర్యలు చేపడతామని ఇచ్చిన ఎన్నికల హామీని వైసిపి ప్రభుత్వం ఇప్పటికైనా నిలబెట్టుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్, ఎఎంసి ప్రిన్సిపల్ బుచ్చిరాజు, ప్రభుత్వ శ్వాస కోశ ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్ కుమార్, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ బి.ఎ.నాయుడు పాల్గొన్నారు.

ఘటనా స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న సిపి రవిశంకర్

ఎయు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

సంభవించింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు అభిషేక్ (17, మనోహర్ (17) మృతిచెందారు. ప్రమాదం జరిగిన సమయంలో బైకు నెమ్మదిగా వస్తున్నప్పటికీ లారీ డ్రైవర్ అప్రమత్తంగా లేకపోవడంతో ప్రమాదం సంభవించిందని ప్రాథమికంగా నిర్ధారించామని ఎడిసిపి తెలిపారు. అనంతరం సంఘటనా స్థలాన్ని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ పరిశీలించి ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్రీటౌన్ సిఐ కె.రామారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

మూఢ నమ్మకాలను వీడాలి

ప్రజాశక్తి- మోతుగూడెం : చేతబడి, సిల్లంగి, దిష్టి తగలడం వంటి మూఢనమ్మకాలు వీడాలని, ప్రతి ఒక్కరూ చదువుకొని జ్ఞానం పెంచుకోవాలని భారతీయ నాస్తిక సమాజ్ జ్ఞాన మండలి అధ్యక్షులు బైరి నరేష్ అన్నారు. చింతూరు మండలం, మోతుగూడెం, పలు గిరిజన గ్రామాల్లో శుక్రవారం బైరి నరేష్, ఆయన సహచరులు పర్యటించారు. అక్కడ గిరిజనుల జీవన శైలిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ యువతీ, యువకులు భారత రాజ్యాంగాన్ని, మూఢనమ్మకాల నివారణ పుస్తకాలు చదవాలని సూచించారు. ప్రతి విషయాన్ని పరీక్షించి నిజం తెలుసుకోవాలన్నారు. అమాయక ప్రజలను మోసం చేయడానికే మూఢనమ్మకాలను కొంతమంది సృష్టిస్తున్నారని తెలిపారు.

'అన్‌వెయిలింగ్ బాండ్స్' నవల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కుటుంబ బంధాలు, వాటి వెనుక దాగివున్న అపోహలు, ఆత్మీయతతో కూడిన అంశాలను రచయిత డాక్టర్ స్నేహ వసుంధర తన నవలలో గొప్పగా ఆవిష్కరించారని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య బాల మోహన్ దాస్ అన్నారు. శుక్రవారం ఆంధ్ర విశ్వ విద్యాలయం హిందీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రచయిత డాక్టర్ స్నేహ వసుంధర రచించిన 'అన్‌వెయిలింగ్ బాండ్స్' ఆంగ్ల నవలను బాలమోహన్ దాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవల ఆద్యంతం ఆసక్తిదాయకంగా ఉందన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతీయ వాతావరణంతో కూడిన పాత్రలు, మరీ ముఖ్యంగా లంబసింగి వంటి ప్రాంతాల సౌందర్యాన్ని ఈ ఆంగ్ల నవలలో ప్రస్తావిస్తూ రచన చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో లోక్ నాయక్ ఫౌండేషన్ అధ్యక్షులు, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, రచయిత డాక్టర్ స్నేహ వసుంధర, ఆచార్య నల్లా బాబయ్య, పలువురు అధ్యాపకులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

'గరుడ యాప్‌తో ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతు'

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గరుడ యాప్ ద్వారా ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతవుతున్నాయని ఎన్నికల అధికారులు తెలిపారని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ తెలిపారు. తన కుటుంబంతోపాటు తూర్పు నియోజకవర్గంలో 40 వేల ఓట్లు గల్లంతైన నేపథ్యంలో వివరంగా జిల్లా కలెక్టర్‌కు తాను ఫిర్యాదు చేయగా శుక్రవారం తన నివాసానికి స్పెషల్ డిప్యూటీ తహశీల్దార్, స్టీల్‌ప్లాంట్, తూర్పు నియోజకవర్గం ఎలక్ట్రోరియల్ ఆఫీసర్ మోహన్‌రావు, బూత్ లెవెల్ ఆఫీసర్ కృష్ణవేణి చేరుకున్నారన్నారు. కుటుంబ ఓట్లు పొరపాటున తొలగిపో యాయని, ఫారం 6 ద్వారా మళ్లీ ఓటు హక్కును పొందవచ్చని తనకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర స్థాయి సమావేశం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఛైర్మన్ కేతా శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం నగరంలోని ఓ హోటల్‌లో జరిగింది. నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకుని అందరికీ పరిచయం చేశారు. జెఎసి రాష్ట్ర గౌరవ చైర్మన్‌గా మందారపు వెంకటరామయ్య, వైస్ చైర్మన్‌గా ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజమాణిక్యం కటికితల, చైర్మన్‌గా ఎపిఎస్ ఆర్‌టిసికి చెందిన పక్కిభూషణరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఇరిగేషన్ జెఇ కె.గౌరమ్మ, సెక్రటరీగా ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎన్.డి.పాల్, విశాఖ జిల్లా చైర్మన్‌గా స్టీల్‌ప్లాంట్ టెక్నీషియన్ దొమ్మేటి అప్పారావు, పాడేరు జిల్లా సెక్రటరీగా నక్క సత్యనారాయణ ఎన్నికయ్యారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

దళిత హక్కుల రక్షణ, సామాజిక న్యాయం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 22న జరగనున్న దళిత హక్కుల రక్షణ, సామాజిక న్యాయం రాష్ట్ర స్థాయి సదస్సు పోస్టర్‌ను శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు వై.రాజు మాట్లాడుతూ కేంద్రంలో మనువాద బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దళిత, గిరిజన, ముస్లిం, క్రైస్తవులపై దాడులు పెరిగాయన్నారు. దళితులకు, అట్టడుగు వర్గాలకు ఉపాధి కల్పిస్తున్న ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తూ పాలకులు ఎలా ఉపాధి అవకాశాలను కాలరాస్తున్నారో వివరించారు. సబ్ ప్లాన్ నిధులను పక్కదోవ పట్టించడంపై మండిపడ్డారు.

ఈ నేపథ్యంలో ఈ నెల 22న డాబాగార్డెన్స్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సదస్సు ఏర్పాటు చేశామన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘం నాయకులు ఎం.సుబ్బారావు, రామారావు, రత్నం, ఎర్రి బాబు, గిరిజన సంఘం నాయకులు కె.సురేంద్ర, మత్స్యకార సంఘం నాయకులు కె.చంద్రశేఖర్, సిఐటియు నాయకులు కెవిపి.చంద్రమౌళి, డివైఎఫ్ఐ నాయకులు సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెన్షనర్ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఇపిఎస్ 95 పెన్షనర్ల సమస్యలపై ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సుధాకర్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌ను రూ.9 వేలకు పెంచి వెంటనే అమలు చేసేలా చూడాలన్నారు. ఇపిఎస్ 95 పెన్షన్ ప్రారంభమై 28 ఏళ్ల అవుతోందని తెలిపారు. ఇప్పుడిస్తున్న పెన్షన్‌తో కనీస అవసరాలు తీరక పెన్షనర్లు నానా యాతనలతో జీవితాన్ని గడుపుతున్నారని తెలిపారు. 75 లక్షల మంది పెన్షనర్లలో 30 లక్షల మందికి సగటున రూ.800 మాత్రమే లభిస్తున్న విషయాన్ని తెలియజేశారు. మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం పెన్షనర్లపై ఎంత నిర్లక్ష్యం వహిస్తోందో తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల ఇండియా వేదిక మ్యానిఫెస్టోలో ఇపిఎస్ 95 పెన్షనర్లకు న్యాయం జరిగే విధంగా అంశాలను పొందుపరచాలని సీతారాం ఏచూరిని సుధాకర్ కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పి.అజయ్ కుమార్, అధ్యక్షులు ఎస్.ఎ.శాస్త్రి, ప్రధాన కార్యదర్శి సత్తిరాజు, కృష్ణా జిల్లా నాయకులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బాల వికాస ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి జరిగే బాలల హక్కుల పరిరక్షణ అవగాహన సమావేశాల పోస్టర్‌ను ఎంవిపి.కాలనీలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు, సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు ఆవిష్కరించారు.

IN THE HONOURABLE COURT OF THE FAMILY JUDGE AT VIZIANAGARAM.
F.C.M.C. 4/2022

Between: **Kakarlapudi Lakshmi** ...Petitioner
And: **Kakarlapudi Krishnam Raju** ...Respondent

To,
Kakarlapudi Krishnam Raju, S/o Subbaraju, Private employee, R/o G-1, Phase-IV, A-Block, Srinivasa Nagar, Srinidhi Apartments, Driver's Colony, Old Gajuwaka, VISAKHAPATNAM

NOTICE

Please take notice in the above case, the petitioner claiming maintenance to her, is posted to **5-12-2023,** for your appearance **at 10.00.A.M** before the above court. You are hereby inform to attend on that day either in person or through an advocate, failing which the matter will be heard in exparty.

S.S.S.S.V.R.M. RAJU
Advocate,
Vizianagaram, Cell: 8790826711.

IN THE COURT OF THE Vth JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT :: HYDERABAD
O.S.NO. **1581** OF **2022**

Between :
M/s. Aurobindo Pharma Ltd. ... Plaintiff
AND
G. Murali & Others ... Defendants

To,
1. Gadi. Murali, S/o. Patru Naidu 1-90, Koyyuru, Kantharam, Vizag Andhra Pradesh - 531084
2. Patru Naidu S/o. Nagabbai 1-90, Koyyuru, Kantharam, Vizag Andhra Pradesh - 531084

... Defendant No.1 & 3

Whereas the plaintiff Company filed the above suit against you for recovery of damages / money. The above suit is posted to **06-12-2023** for your appearance. You are hereby summoned to appear either in person or through your pleader with your defense if any at **10:30** a.m. on the above said date before the Hon'ble Court, failling which the suit will be heard and determined exparte.

(By Order of the Hon'ble Court)

K. Venugopal Reddy
K. Narasimha Reddy
Advocates
4-92/2/A, Ist Floor, Opp. Meeseva & Chandanagar, GHMC, Hyderabad - 500 050

ముళ్ల కంచెలతో పొంచి ఉన్న ముప్పు!

ఏనుగులపాలెం వద్ద రోడ్డును కమ్మేసిన ముళ్లకంచెలు

- ఇరువైపులా రోడ్డును కమ్మేయడంతో అవస్థలు
- తరచూ ప్రమాదాలతో వాహనదారుల భయం
- ఇటీవలే ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని ఆనందపురం-బోని గోస్తనీ రహదారిలో ఇరువైపులా కమ్మేసిన ముళ్లకంచెలతో ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించనంతగా ముళ్లపొదలు ఏపుగా పెరగడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల అకస్మాత్తుగా రోడ్డెక్కిన ట్రాక్టర్‌ను ముళ్లపొదల వల్ల గుర్తించడంలో అలస్యమై ఒక బైకిస్ట్ దుర్మరణం పాలైన సంఘటన చోటుచేసుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై వాహనదారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఆనందపురం, బోని గోస్తనీ రోడ్డులో ఏనుగులపాలెం దాటిన తర్వాత రోడ్డుకు ఇరువైపులా ముళ్ళకంచెలు దట్టంగా పెరగడంతో వాహన దారులు పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కాదు. అధ్వానంగా ఉన్న రోడ్డును అభివృద్ధి చేయడంతో కాస్తా వేగం పెంచి ముందుకు వెళితే ఏం ముప్పు వస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. పలుచోట్ల సగానికి పైగా రోడ్డును ముళ్లకంచెలు కమ్మేయడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురికావడం, ప్రాణాలు పోవడం ఖాయమని ఇటీవల చోటు చేసుకున్న ఘటన నిదర్శనమని స్థానికులు వాపోతున్నారు.

పక్కన ఉన్న పొలాల్లోంచి రోడ్డెక్కిన ట్రాక్టర్‌ను ముళ్లపొదలు, మలుపులు వద్ద సకాలంలో గుర్తించని స్థితిలో ఇటీవల ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో బైకిస్ట్ దుర్మరణం పాలయ్యాడు. పట్టపగలే ఇటువంటి ప్రమాదం చోటుచేసుకుందంటే, రోడ్డుపై ముళ్లకంచెలతో ఎంతటి ముప్పు పొంచి ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక రాత్రివేళలో ఈ మార్గంలో ప్రయాణం ప్రాణసాహసమేనని వాహనదారులు, ప్రయాణికులు అంటున్నారు. ఈ రోడ్డులో లైట్లు కూడా లేకపోవడంతో రాత్రివేళల్లో కమ్ముకున్న చీకట్లలో ముళ్లకంచెలను దాటి వెళ్లడం కష్టమేనని, ఇలా పలుప్రమాదాలు జరిగాయని స్థానికులు అంటున్నారు. ఇక పొలాలకు వెళ్లే రైతులు కూడా ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఆనందపురం బోని మార్గంలో జంగిల్ క్లియరెన్స్ చేయించాలని, మలుపుల వద్ద రోడ్డు విస్తరణ చర్యలతోపాటు రోడ్డులో లైట్లు వేయించాలని పలువురు వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

తునివలస పంచాయతీ కార్యదర్శికి మెమో

రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ విజయకుమార్

ప్రజాశక్తి -పద్మనాభం : హాజరు పట్టికలో సంతకాలను సరిగా పెట్టకపోవడం, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంపై వివరణ కోరుతూ తునివలస పంచాయతీ కార్యదర్శి బివి.రవికి స్థానిక ఎంపిడిఒ ఎం.విజయకుమార్ మెమో జారీ చేశారు. శుక్రవారం తునివలస సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపిడిఒ విజయకుమార్, సచివాలయంలోని హాజరుపట్టికలు, మూమెంట్, లీవ్, తీర్మానాల రిజిస్టర్లు, క్యాష్ బుక్‌లను తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో గురు, శుక్రవారాల్లో పంచాయతీ కార్యదర్శి రవి సంతకాలు పెట్టకపోవడం, మూమెంట్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడం, ఇ-సర్వీసెస్ అమౌంట్ సకాలంలో కట్టకపోవడంతో పాటు ఇ-సర్వీసెస్ నగదు వివరాలను మే 31 నుంచి నేటివరకు నమోదు చేయకపోవడాన్ని గుర్తించారు. దీనిపై వివరణ కోరుతూ పంచాయతీ కార్యదర్శి రవికి ఎంపిడిఒ విజయకుమార్ మెమో జారీ చేశారు. వివరణ అనంతరం తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రాష్ట్రంలో రాబోయేది ఉమ్మడి ప్రభుత్వమే

- జనసేన విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు పంచకర్ల

ప్రజాశక్తి- మధురవాడ : వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని జనసేన విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఎండాడ జనసేన కార్యాలయంలో భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సందీప్ పంచకర్ల ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు పరిచయ వేదిక నిర్వహించారు.

ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ జనసేన, తెలుగుదేశం పార్టీల కలయిక వైసిపి నేతలకు మింగుడు పడడం లేదన్నారు. అధికారాన్ని కోల్పోవడం ఖాయమని నిర్ధారణకు రావడంతో వైసిపి నేతలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నియోజవర్గం పరిధిలో భూకబ్జాలు, ఎర్రమట్టి దిబ్బలు, రుషికొండ అక్రమణలు, పాండురంగ బ్రిడ్జిపై నిరాహార దీక్ష, తాటితూరులో గ్రామస్తుల సమస్యలపై జనసేన ఆధ్వర్యంలో సందీప్ చేపట్టిన పోరాటాలను రమేష్‌బాబు అభినందించారు. 2009లో ప్రజారాజ్యం పార్టీని గెలిపించినట్లే, 2024 ఎన్నికలలో టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని అభ్యర్థించారు. నియోజకవర్గ సమన్వయకర్త బివి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో పంచకర్ల సందీప్, బూత్ కన్వీనర్ ఇఎన్ఎస్ చంద్రరావు, మీడియో ఇన్‌ఛార్జి నాగోతి నరసింహనాయుడు, శాఖరి శ్రీను బాబు, పోతిన అనురాధ, పరిమి భువనేశ్వరి, నక్క శ్రీధర్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల జిఒ నిబంధనలు మార్చాలి

కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు

ప్రజాశక్తి- మాధవధార : జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లోని నిబంధనలను సరళతరం చేసి, అర్హులైన ప్రతిఒక్కరికీ ఉచితంగా ఇళ్ల స్థలాలను అందించేలా సవరణలతో కొత్త జిఒ జారీ చేయాలని ఎపి కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర చైర్మన్ మూల వెంకటరావు సూచించారు. జిఒ395లోని నిబంధనలు జర్నలిస్టులను తీవ్ర నిరాశకు గురిచేశాయన్నారు. రాష్ట్ర విభజన అనంతరం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తున్నందున, 2014 తర్వాత లబ్ది పొందని, అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు..ఇళ్ల స్థలాలకు జర్నలిస్ట్‌ల తరుపున 40శాతం వాటా చెల్లింపు వారికి భారమౌతుందని, దీన్ని 90:10 నిష్పత్తిగా మార్పుచేయాలని సూచించారు. అలాగే జర్నలిస్ట్‌లకు గానీ, వారి జీవిత భాగస్వాములకు ఇళ్లు, ఇంటిస్థలం ఉంటే, ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చే ఇళ్ల స్థలానికి అర్హులు కాదన్న జిఒలోని నిబంధనలను సడలించాలని కోరారు.ఏజెన్సీ ప్రాంతంలో 1/70 నిబంధన అమలును దృష్టిలో పెట్టుకుని, అక్కడి జర్నలిస్ట్‌లకు మైదాన ప్రాంతంలో ఇళ్లస్థలాలను కేటాయించాలని సూచించారు. జర్నలిస్ట్‌లందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీకి వీలుగా నిబంధనలను సరళతరం చేయాలని వెంకటరావు కోరారు.

దొంగపట్టాలతో ప్రభుత్వ భూమికి టోకరా?

వైసిపి నేతల భూదందాపై కలెక్టర్‌కు సిపిఐ నేత పైడిరాజు ఫిర్యాదు

ప్రజాశక్తి -మధురవాడ: విశాఖ రూరల్ మండలం, మధురవాడ 191 సర్వే నెంబరులో 2.18 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసిపికి చెందిన ముగ్గురు నేతలు దొంగపట్టాలు సృషించి, అమ్మకానికి యత్నిస్తున్నారని ఈ ప్రాంతానికి చెందిన సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఆరోపించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశానన్నారు. రాష్ట్రస్థాయిలో ఒక సంస్థకు ప్రస్తుత చైర్మన్, సింహాచలం దేవస్థానం పాలకమండలి పూర్వసభ్యురాలు, వైసిపి సాంస్కృతిక మండలి నేత ఒకరు మధురవాడలో బహిరంగ మార్కెట్‌లో రూ. 20కోట్లు విలువ చేసే ప్రభుత్వభూమికి ఎసరు పెట్టాలని చూస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల అండ లేకుండా ఇంత పెద్ద అక్రమానికి ఆస్కారం లేదన్న విషయాన్ని గమనంలో పెట్టుకుని, దీనిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని పరిరక్షించి, ప్రజోపయోగానికి వినియోగించాలని పైడిరాజు కోరారు. దీనిపై సంబంధిత అధికారుల స్పందన, వివరణ ఎలా ఉంటుందో చూడాలి.

పంచగ్రామాల సమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం

ఇళ్ల మరమ్మతులకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు : ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి- సింహాచలం: పంచగ్రామాల భూసమస్యకు త్వరలో శాశ్వత పరిష్కారం లభిస్తుందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సింహాద్రి అప్పన్నను దర్శించుకునేందుకు వచ్చిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, పంచ గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్న ఇల్లు మరమ్మతులకు వీలుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పంచగ్రామాల భూసమస్య పరిష్కారానికి సిఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. సింహాచల దేవస్థానానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ సమస్య లేకుండా నిర్వాసితులకు టిడిఆర్‌లు, నష్టపరిహారం చెల్లించి బిఆర్‌టిఎస్ రోడ్డు పనులు త్వరలో చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ప్రసాదం స్కీం పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు.

పలువురికి ముత్తంశెట్టి పరామర్శ

ఆనందపురం : అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు నాయకులను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం పరామర్శించారు. శొంఠ్యాం ఎంపిటిసి భర్త, వైసిపి నేత పల్లా రమణ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని పరామర్శించారు. అనారోగ్యం నుంచి కోలుకున్న గుడిలోవ దేవస్థానం చైర్మన్ కోరాడ గిరిరాజును ఆయన స్వగృహం పరామర్శించి యెగా క్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. గండిగుండం సర్పంచ్ గన్‌రెడ్డి శ్రీను, లంక రాంబాబు, పాండ్రంకి శ్రీను, కోరాడ ముసలినాయుడు ఉన్నారు

శ్మశానవాటికకు ప్రహరీ నిర్మాణం

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు చిల్లపేట, జీరుపేట పరిధిలో గల్లీ రోడ్డు సమీపంలోని శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృషితో ప్రహరీ నిర్మాణానికి రూ.42 లక్షల నిధులు మంజూరు కాగా, పనులు మొదలెట్టినట్లు వార్డు వైసిపి అధ్యక్షులు ఎస్ భాస్కరరెడ్డి, యూత్ ప్రెసిడెంట్ బింగి హరికిరణ్ రెడ్డి, పార్టీ నాయకులు శివాంజనేయరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, ఎం ఆదినారాయణ రెడ్డి తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే ముత్తంశెట్టికి వారు కృతజ్ఞతలు తెలిపారు

నేరాలు ఘోరాలు

140 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారిపై కారులో అక్రమంగా తరలిస్తున్న 140 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విభూషణరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం నక్కపల్లి జాతీయ రహదారిపై ఆసుపత్రి సమీపంలో ఉన్న బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేయగా ఎక్స్‌యువి 500 వాహనంలో మహారాష్ట్రకు చెందిన ముగ్గురు వ్యక్తులు 140 కేజీల గంజాయిని ఒరిస్సాలో కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నారని తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, గంజాయి, కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట: మండలంలో రాజంపేట రోడ్డులో గురువారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా 107 మద్యం సీసాల రవాణా చేస్తున్న చిట్టియ్యపాలెం గ్రామానికి చెందిన పడమటి రాజేష్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు బుచ్చయ్యపేట ఎస్సై బి.కుమార్ స్వామి తెలిపారు. ఈ మేరకు మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచామని, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని ఎండపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కోటవురట్ల గ్రామానికి చెందిన జవ్వాది ప్రకాష్ (54) ద్విచక్ర వాహనంపై శుక్రవారం సాయంత్రం నర్సీపట్నం నుండి వస్తున్నాడు. ఆ సమయంలో తాడిపెద్దు అడ్డంగా రావడంతో ఢీ కొట్టాడు. దీంతో తాడిపెద్దు అతన్ని బలంగా పొడవడంతో కొమ్ములు గుచ్చుకొని ఘటనా స్థలంలోనే మరణించాడు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. ఈ ఘటనతో కుటుంబంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి.

తారాజువ్వలు తెచ్చిన తంటా!

చందకలో కోళ్ల ఫారం దగ్ధం : రూ.50వేల ఆస్తి నష్టం

దగ్ధమైన కోళ్ల ఫారం షెడ్

ప్రజాశక్తి -ఆనందపురం: నాగులచవితిని పురస్కరించుకొని వదిలిన తారాజువ్వలు పడడంతో చందకలో కోళ్ల ఫారం షెడ్ దగ్ధమైంది. సుమారు రూ.50వేల ఆస్తినష్టం జరిగింది వివరాలివి. నాగులచవితి సందర్భంగా పుట్టలో పాలు పోసేందుకు వెళ్లిన వారు సరదాగా కాల్చిన తారాజువ్వలు పడడంతో చందకలో ఆనందపురం, బోని రోడ్‌లో నిమ్మపూడి శ్రీనివాస్ అనే వ్యక్తి లీజుకు తీసుకుని నిర్వహిస్తున్న కోళ్లఫారం షెడ్‌పై పడడంతో మంటలు రాజుకున్నాయి. దీన్ని గమనించిన సమీపంలో ఉన్న సిబ్బంది స్థానికుల సహకారంతో ఇతర షెడ్‌లకు మంటలు వ్యాపించకుండా అదుపు చేయడంతో పాటు షెడ్‌కు అంటుకున్న మంటలను ఆర్పేశారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మిగతా మంటలను ఆర్పేశారు. ఈ ప్రమాదంలో కోళ్ల షెడ్‌తోపాటు అందులో ఉన్న ఫీడర్లు, డ్రింక్ బాటిళ్లు సర్వం కాలిబూడిదయ్యాయి. కోడిపిల్లలు లేకపోవడంతో భారీ ఆస్తినష్టం తప్పిందని బ్యాగ్ మాజీ అధ్యక్షులు గీత నాగేశ్వరరావు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేలు ఆస్తినష్టం జరిగిందని అంచనా వేశారు. అధికారులు పరిశీలన జరిపి, బాధితులకు న్యాయం చేయాలని నాగేశ్వరరావు కోరారు.

ఎరుకల కాలనీలో అగ్నికి ఆహుతైన ఇల్లు

ఎరుకుల కాలనీలో శుక్రవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక ఇల్లు అగ్నికి పూర్తిగా ఆహుతి అయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. తద్వారా భారీ ప్రమాదాన్ని నివారించారు. అగ్నిప్రమాదానికి షార్ట్‌సర్క్యూటా?లేక ఇంకేదైనా కారణమా అన్న విషయం తెలియరాలేదు.

తైక్వాండో పోటీల్లో భువనేశ్వరికి కాంస్యం

భువనేశ్వరిని అభినందిస్తున్న డీన్ డాక్టర్ సుధాకర్

ప్రజాశక్తి -తగరపువలస : సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీ తైక్వాండో పోటీల్లో స్థానిక సంగివలస, అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల విద్యార్థిని భువనేశ్వరికి కాంస్య పతకం లభించింది. రాజస్థాన్‌లో ఈ నెల 6 నుంచి 9 వ తేదీ వరకు డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యాన నిర్వహించిన పోటీల్లోకాంస్య పతకం సాధించినట్లు సంస్థ డీన్ డాక్టర్ పివి సుధాకర్ తెలిపారు. శుక్ర వారం కాలేజీలో పతకాన్ని సాధించిన భువనేశ్వరిని డీన్ డాక్టర్ సుధాకర్‌తోపాటు ప్రిన్సిపల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ గున్నాజీ తదితరులు అభినందించారు

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

సిఐ ఎర్రంనాయుడును అభినందిస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి -గాజువాక: శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని న్యూపోర్టు సిఐ కింజరాపు ఎర్రంనాయుడు తెలిపారు. శుక్రవారం గాజువాక నియోజకవర్గ సిపిఐ నేతలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించారు. ఈ సందర్భంగా న్యూపోర్టు స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల సమస్య, దొంగతనాలపై ఆయన దృష్టికి తేగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సిపిఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కశిరెడ్డి సత్యనారాయణ, పెదగంట్యాడ ఏరియా కార్యదర్శి యేల్లేటి శ్రీనివాసరావు, నాయకులు జి. ఆనంద్, కె. అచ్యుతరావు, అప్పారి విష్ణు, కె రమేష్, కోళ్ల రమణ పాల్గొన్నారు

ప్రైవేట్ స్కూళ్ల 'గుర్తింపు' సమస్య పరిష్కరించాలి

సజ్జలను కలిసిన అప్సా నేతలు

ప్రజాశక్తి-గాజువాక: ప్రైవేట్ స్కూళ్ల గుర్తింపు ప్రక్రియ సమస్యను వెంటనే పరిష్కరించాలని అప్సా నాయకులు ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. తాడేపల్లిలోని వైసిపి కార్యాలయంలో సజ్జలను కలిసి, పాఠశాలలగుర్తింపు రెన్యువల్స్‌ను జిఒ 38 ప్రకారం ఎనిమిదేళ్లకు పొడిగించాలని, 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు తేదీ సమీపిస్తున్న దృష్ట్యా ఆఫ్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌ను ఆఫ్‌లైన్‌లోనే పరిష్కరించాలని కోరారు. గుర్తింపు పునరుద్ధరించాలని, వచ్చే విద్యా సంవత్సరానికి గుర్తింపు రెన్యువల్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు నెలకొన్న సాంకేతిక సమస్యల సత్వర పరిష్కారానికి ఒక టెక్నికల్ అసిస్టెంట్ ను ప్రత్యేకంగా ఏర్పాటుచేయాలని కోరారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వివిధ కారణాలతో రిజిస్ట్రేషన్ జరగని పాఠశాల గుర్తింపు రెన్యువల్ విషయంలో రిజిస్టర్డ్ లీజ్ అగ్రిమెంట్స్ మాత్రమే కాకుండా ద్వైపాక్షిక ఒప్పంద పత్రాలను కూడా అంగీకరించాలని కోరారు. దీనిపై సజ్జల స్పందిస్తూ పాఠశాల గుర్తింపు రెన్యువల్ విషయంలో యాజమాన్యాలు పడుతున్న అన్ని ఇబ్బందులను వెంటనే పరిష్కరిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. సజ్జలను కలిసిన వారిలో సంఘ నాయకులు వి.సుందరరాం, చంద్రశేఖరరావు, జనార్ధన్, సుబ్రమణ్యం రాజు, సింహాచలం, పాలవలస భాస్కరరావు, 18 జిల్లాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు ఉన్నారు..

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్

యుటిఎఫ్ గాజువాక మండల కమిటీ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -గాజువాక : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికియుటిఎఫ్ రాష్ట్ర నాయకులు పోరాటం చేస్తున్నారని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి ఆర్ అంబేద్కర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ గాజువాక మండల ప్రధాన కార్యదర్శి సబ్బారపు నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశం మాట్లాడుతూ పలు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ నాయకులు చేపడుతున్న పోరాట విషయాలను వివరించారు. విపక్షనేతగా నాడు పాదయాత్రలో, ఎన్నికల్లోనూ ప్రస్తుత సిఎం ఇచ్చిన హామీ మేరకు ప్రత్యామ్నాయాలు లేకుండా పాత పింఛను విధానం అమలు చేసేంత వరకు యుటిఎఫ్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. పాఠశాలల పర్యవేక్షణ పేరుతో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆక్షేపించారు.

యుటిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గం

ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాడెన అప్పారావు ఎన్నిక పరిశీలకులుగా గాజువాక మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నిడదవోలు శ్రీనివాసరాజు, అధ్యక్షులుగా ఎన్.వి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సబ్బారపు నూకరాజు, సహాధ్యక్షులుగా ఎం.అనితకుమారి, ఎండీఅబ్దుల్ హక్, కోశాధికారిగా కె.చెల్లారావు, కార్యవర్గ సభ్యులుగా నిరుపమ పరదేశి, సుగుణ, వై.రాంబాయి, రవికుమార్, జిల్లా కౌన్సిలర్స్‌గా విజయకుమార్, అబ్రహం లింకన్, సువర్ణలత, విజయకుమారి, ఆడిట్ కమిటీ సభ్యులుగా నూకరాజు, సిపిఎస్ కన్వీనర్‌గా ఎస్.శివలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సింహాచలం, ఇందిర పాల్గొన్నారు.

ఉక్కు దీక్షలకు ఒబిసి నేతల సంఘీభావం

సంఘీభావం తెలుపుతున్న ఒబిసి నేతలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు తమ యూనియన్ తరపున ఎంత దూరమైనా వెళ్లి పోరాడుతామని స్టీల్‌ప్లాంట్ ఒబిసి యూనియన్ నాయకులు బి అప్పారావు స్పష్టం చేశారు.. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షల శిబిరం శుక్రవారం 1009వ రోజుకు చేరిన సందర్భంగా ఒబిసి యూనియన్ నాయకులు పాల్గొని, కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఒబిసి యూనియన్ నేత అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుంటేనే రిజర్వేషన్లకు మనుగడ ఉంటుందన్నారు. భవిష్యత్తు తరాలకు రిజర్వేషన్ల ఫలాలు అందాలంటే స్టీల్‌ప్లాంట్‌ను కచ్చితంగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, కామేశ్వరరావు, ఎం.ఎన్.ప్రసాద్, గెద్దాడ అప్పలరాజు, గోవింద, మోహిద్దీన్, ఆర్ఎస్ఎన్ శశిభూషణరావు, పోరాట కమిటీ చైర్మన్ ఆదినారాయణ, మస్తానప్పు, నాయుడు, సన్యాసిరావు, రామకృష్ణ, పల్లా పెంటరావు, ఈశ్వరరావు, గద్దర్ అప్పలరాజు పాల్గొన్నారు

అభివృద్ధిని చూసి ఓర్వలేకే అసత్య ప్రచారం

మాట్లాడుతున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఓటర్ జాబితాలపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని విశాఖ ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు అన్నారు. శుక్రవారంఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, ఉత్తర నియోజకవర్గంలో ఓట్లు మాయం అంటూ వస్తున్న కథనాలన్నీ అవాస్తవాలేనన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచే సత్తాలేకనే, ఎన్నికల సంఘంతో మాట్లాడి ఎలక్షన్స్ ఆపేయడానికి చంద్రబాబు దత్త పుత్రుడు విష్ణు కుమార్‌రాజు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తెలుగుదేశం పార్టీకే భవిష్యత్తు గ్యారంటీ లేదని, జనసేన వారాహియాత్ర ముగిసిపోయిందని, అందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. విష్ణు కుమార్‌రాజు బిజెపి కండువా చేసుకుని చంద్రబాబు చెప్పిందే మాట్లాడుతున్నారని ఆరోపించారు. గంటా శ్రీనివాసరావు సీటు ఎక్కడో ఆయనకే తెలియదని, సంక్షేమంపై చర్చకు సిద్ధమంటూ ప్రకటనలు చేయడం శోచనీయమన్నారు. ఉత్తర నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు రావాలని సవాలు విసిరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ కంపా హనోక్, అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్‌రాజు, కె.వి.యన్ శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్ పీలా వెంకటలక్ష్మి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, జెసిఎస్ మండల కన్వీనర్లు నీలి రవి, బులుసు జగదీశ్, అమర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు, రేపు టిడిపి, జనసేన నిరసన

ప్రజాశక్తి- గాజువాక: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఈనెల 18,19 తేదీల్లో టిడిపి, జనసేన ఆధ్వర్యాన నిరసన చేపట్టనున్నట్లు గాజువాక నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలోకనీసం అభివృద్ధి జరగలేదన్నారు. ప్రధాన రహదారులను పునర్నిర్మాణం మాట అటుంచితే కనీసం మరమ్మతులు చేపట్టకపోవడం ప్రజాసమస్యలపై వైసిపి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని మండిపడ్డారు.

టిడిపి, జనసేన జెఎసి ఉమ్మడి పిలుపుమేరకు ఈ నెల18న బిసి రోడ్డు కాకతీయ జంక్షన్ వద్ద, 19న కణితి రోడ్డు జగ్గు జంక్షన్ వద్ద ఇరుపార్టీల ఆధ్వర్యంలో మహా నిరసన చేయనున్నట్లు తెలిపారు. విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోన తాతారావు పాల్గొంటారని, రెండు పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని మహానిరసన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సందర్శకులతో జూ కిటకిట

ఒక్క రోజు ఆదాయం రూ 8,14,753

జూ పార్కులో సందడి చేస్తున్న సందర్శకులు

ప్రజాశక్తి - ఆరిలోవ : కార్తీకమాసం, నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల శుక్రవారం సందర్శకులతో కిటకిటలాడింది. జూ అధికారులు సందర్శకుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసారు. విశాఖ నగరం నలుమూలల నుంచి కుటుంబ సభ్యులు, స్నేహితులతో సందర్శకులు భారీగా వచ్చారు. జూ పార్కులో ఉన్న పుట్టల్లో పాలు పోసి నాగదేవతకు పూజలు చేసారు. కుటుంబ సభ్యులతో వనభోజనాలు ఆరగిస్తూ, ఆటపాటలతో ఆనందంగా, సందడిగా గడిపారు. నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం 9,150 మంది సందర్శకులు జూకు రాగా, మొత్తం రూ 8 లక్షల 14 వేలు ఆదాయం వచ్చింది.

నవజాత శిశువుల విజయోత్సవం

నవజాత శిశువులతో రెయిన్‌బోలో ఆసుపత్రి వైద్య బృందం

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రపంచ ప్రీమెచ్యూరిటీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆరిలోవ హెల్త్‌సిటీలోని రెయిన్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో శుక్రవారం నవజాత శిశువుల విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా రెయిన్ బో ఆసుపత్రిలోను, బయట జన్మించిన 20 మంది నవజాతి శిశువుల విజయాన్ని, వారి తల్లిదండ్రులు అతిధుల సమక్షంలో వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విశాలి జె.కోలే, డాక్టర్ అన్వేషి, డాక్టర్ బాలశ్రీలత పులి, డాక్టర్ రాగసుధ, డాక్టర్ శైలజ, డాక్టర్ నిహారిక అల్లు, డాక్టర్ సరోజ నేతృత్వంలో వైద్య బృందం నుంచి సమగ్ర సంరక్షణ పొందిన నెలలు నిండకుండా జన్మించిన 20 మంది శిశువుల అసాధారణ ప్రయాణం ప్రీమెచ్యూరిటీ దినోత్సవాన్ని జరుపుకోవడం, ఆయా చిన్నారుల శక్తిని గౌరవించడానికి, ప్రమాణాన్ని గుర్తించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శాశ్వత్ మొహంతి, డాక్టర్ యశ్వంత్ రెడ్డి, రావి శ్రీనివాసరావు, రెయిన్ బో చిల్డ్రన్ ఆసుపత్రి యూనిట్ అధిపతి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ

కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గంగరాజు

ప్రజాశక్తి -ఆనందపురం: జగనన్న ఆరోగ్య సురక్ష తొలివిడత కార్యక్రమంలో గుర్తించిన లబ్ధిదారులకు శుక్రవారం ముకుందపురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరంలో కళ్లద్దాలను పంపిణీ చేశారు. కుసులవాడ, గండిగుండం సచివాలయాల పరిధిలో గత నెలలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో కళ్లద్దాలు అవసరమని గుర్తించిన వారికి ఆనందపురం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ గంగనాయుడు ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ కలిమి గంగరాజు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సహనాజ్ సాదియ, సిహెచ్ఒ పి సాంబమూర్తి, పిహెచ్ఎన్, హెల్త్ సూపర్వైజర్, ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

రైతులకు తోడ్పాటునందించాలి

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు చిక్కాల రామారావు, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా తగిన తోడ్పాటునందించాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుకు ఆదాయం వచ్చే విధంగా ఇతర వ్యవసాయ సంబంధిత మార్గాలను తెలియజేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతు సమస్యలపై లోతుగా దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయం, మత్స్య, ఉద్యానవన, బిందు సేద్యం, నీటిపారుదల శాఖలపై సమీక్షించారు. జిల్లాలో రైతులకు సబ్సిడీ రుణాలు అందించాలని, వ్యవసాయ సహకార బ్యాంకు అధికారులు రైతులకు ఇచ్చే రుణాలను గూర్చి పూర్తి అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో పంటల పరిస్థితులను, వివిధ రిజర్వాయర్లలో నీటి లభ్యతలనుగూర్చి వివిధ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. బోర్లు, నీటి వనరులు ఉన్న ప్రాంతాలలో ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల వారీగా పశు దాణా ఆవశ్యకతను గుర్తించి తదనుగుణంగా అవసరమైన దాణాకు సంబంధించి ఇప్పటినుంచే ప్రణాళిక తయారు చేయాలన్నారు. అదనపు ఆదాయాన్నిచ్చే పాడి, మత్స్య, ఉద్యానవన, కోళ్ల మేకల పెంపకం మొదలైన వాటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. రైతులు పండించిన పంటకు తగిన మద్దతు ధర వచ్చే విధంగా ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. బిందు సేద్యం తుంపర సేద్యం ద్వారా కాయగూరలను పండించడంపై మరింత మంది రైతులకు అవగాహన కలిగించి ప్రోత్సహించాలన్నారు.

వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు చిక్కాల రామారావు మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలన్నారు. ఈ విషయమై ఆయన సలహా మండలి సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. ఇప్పటికే రైతులు వరి పంట నష్టపోయారని ఉద్యానవన రైతులకు కూడా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాడి, స్వల్పకాలిక పంటల ద్వారా రైతుకు సంబంధించిన మార్గాల ద్వారా ఆదాయాలు పొందే విధంగా వివిధ శాఖల అధికారులు రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ రాజ్, సలహా మండలి సభ్యులు ఎస్.రమణ, జి.ఆనందరావు, వి.అచ్చం నాయుడు, ఆర్.గంగునాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రసాదరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌రావు, డిసిసిబి మేనేజర్ వర్మ, మత్స్య శాఖ అధికారి లక్ష్మణమూర్తి, పౌరసరఫరాల డిఎం జయంతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బంగారు, వజ్రాభరణాల ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీ దంపతులు

మలబార్ గోల్డ్‌లో బంగారు వజ్రాభరణాల ప్రదర్శన

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణంలోని మలబార్ గోల్డ్ షోరూమ్‌లో ప్రత్యేక బంగారు వజ్రాభరణాల ఎగ్జిబిషన్‌ను శుక్రవారం అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి.సత్యవతి విష్ణుమూర్తి దంపతులు ప్రారంభించారు. ఈనెల 17 నుండి 20వ తేదీ వరకు ఈ ఆభరణాల ప్రదర్శన ఉంటుందని, ప్రజలందరూ ముఖ్యంగా మహిళలు అందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో షోరూం నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండల కేంద్రం కె.కోటపాడులో శుక్రవారం నాగుల చవితి రోజున గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాగుల చవితికి నాలుగు రోజులు ముందుగా గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్టించి పూజలు జరిపారు. ప్రతి సంవత్సరం లాగే కులానికి ఒక స్టేజి చొప్పున సుమారు 8 స్టేజి వేషాలను ఏర్పాటు చేశారు. ప్రతి స్టేజిపై డాన్స్ బేబీ డాన్స్ ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ప్రతి స్టేజికి బహుమతులను అందజేశారు. ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాలను తిలకించడానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు తరలివచ్చారు. స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు శిథిల రహదారిపై ర్యాలీ

ప్రజాశక్తి అచ్యుతాపురం

మండలంలోని అచ్యుతాపురం నుండి చౌడపల్లి వరకు ఉన్న శిథిల రహదారిపై జనసేన పార్టీ ఆధ్వర్యాన శనివారం ఉదయం 9 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. సంవత్సరాల తరబడి అచ్యుతాపురం అనకాపల్లి రహదారి మరమ్మతులు చేయకపోవడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. అయినా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని, పాలకులు అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా తక్షణమే రహదారి పునర్నిర్మాణం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. జనసేన, తెలుగుదేశం పార్టీల ఉమ్మడి కార్యాచరణలో భాగంగా జనసేన పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి సుందరపు విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ర్యాలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-మునగపాక రూరల్

మండలంలోని మూలపేట గ్రామంలో కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ నంది విమలగిరి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విలమగిరి మాట్లాడుతూ స్పర్శ లేని, రాగి రంగులో ఉండే మచ్చ వున్నచో సంబంధిత ఆశా, ఏఎన్ఎం, ఎమ్మెల్‌హెచ్‌పిలను సంప్రదించాలని సూచించారు. వ్యాధి గురించి ఆందోళన చెందనవసరం లేదని పేర్కొన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్.దేవకాంత మాట్లాడుతూ కుష్టు రహిత భారత దేశాన్ని తొందరలోనే చూస్తామన్నారు. ఈ వ్యాధిపై అవగాహన పెంచుకొని, అపోహలు లేకుండా వ్యాధిగ్రస్తులకు మానసిక ధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. ఒకవేళ ఎవరికైనా 5 లోపు మచ్చలు ఉంటే 6 నెలలు, 5 కన్న ఎక్కువ మచ్చలు ఉంటే సంవత్సరం పాటు ప్రభుత్వం వారికి మందులను ఉచితంగా అందజేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు వివిఎస్ఎం లక్ష్మి, ఎంఎ ఉమా మహేష్, ఎమ్మెల్‌హెచ్‌పి యామిని ప్రియ, ఏఎన్ఎం రమణి, హెల్త్ అసిస్టెంట్ యస్ విశ్వనాథం, ఆశా కార్యకర్తలు రూప, పద్మావతి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నంది విమలగిరి, వైద్య సిబ్బంది

వ్యవసాయ విద్యుత్ సరఫరా సక్రమంగా లేదు

వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కశింకోట

మునగపాక మండలంలోని రైతుల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని సిపిఎం నాయకులు ఆళ్ళ మహేశ్వరరావు, యస్ బ్రహ్మాజీ, గనిశెట్టి సత్యనారాయణ తెలిపారు. కశింకోట ఎపిఇపిడిసిఎల్ డివిజన్ కేంద్రంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక సమావేశం శుక్రవారం జరిగింది. జిల్లా విశ్రాంతి న్యాయమూర్తి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన విద్యుత్ వినియోగదారుల సమావేశంలో సిపిఎం నాయకులు మాట్లాడుతూ పండుగ వాతావరణంలో ఇలాంటి సమావేశాలకు ఎవరు రారని, పండగ లేని రోజుల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వ్యవసాయానికి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. అగనంపూడికి చెందిన బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ అగనంపూడి పరిధిలో విద్యుత్ వాడకం వల్ల దువ్వాడలో సెక్షన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమస్యలుంటే 1912 నెంబర్‌కు ఫోన్ చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్, సురేంద్ర కుమార్, హరిబాబు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, బ్రహ్మాజీ తదితరులు

ఘనంగా జాజులమ్మ పండుగ

ప్రజాశక్తి అచ్యుతాపురం

మండలంలోని మల్లవరం గ్రామంలో శుక్రవారం జాజులమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నవ దినుసులతో కూడిన మొలకెత్తిన మొక్కలతో ర్యాలీ చేశారు. గ్రామ సర్పంచ్ పిన్నమరాజు వాసు, మాజీ సర్పంచ్ కంటిపల్లి శ్రీనివాసరావు, గిసాల నాగమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు కోన సంధ్య బుజ్జి, ఎంపీటీసీ సభ్యురాలు రావి నాగలక్ష్మి శోభన్‌బాబు, పెన్మమరాజు రవీంద్ర రాజు, కృష్ణంరాజు, చల్లా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు మొలకెత్తిన మొక్కలతో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి

గత ప్రభుత్వాల మాదిరిగా ఎన్నికల్లో ఓట్లేసిన వారికే న్యాయం చేస్తానని చెప్పకుండా, వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులకు ఉన్న హక్కులను కాపాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు తెలిపారు. శుక్రవారం దేవరాపల్లిలో నిర్వహించిన జగన్ ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో భాగంగా వాలంటీర్ అధ్వర్యంలో డిప్యూటీ సిఎం పలు గృహాలను సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను, ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.

ఆరోగ్య సంరక్షణ కార్డులు అందజేత

ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసిన డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు

పశువులు, గొర్రెల మేకల పెంపకం దారులకు క్యూఆర్ కోడ్‌తో హోలోగ్రామ్ స్టిక్కర్లు అంటించిన ఆరోగ్య సంరక్షణ కార్డులను పలువురు పాడి రైతులకు డిప్యూటీ సిఎం బూడి అందజేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పశువుల కోసం పశు సంచార అంబులెన్స్‌ల ద్వారా సేవలందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు, ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, పార్టీ మండల అధ్యక్షులు బూరె బాబురావు, సచివాలయ కన్వీనర్ వెంకటరమణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హుండీ తెరిచి ఉన్న దృశ్యం

మూడు ఆలయాల హుండీల్లో చోరీ

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలో మూడు ఆలయాల్లో గురువారం రాత్రి హుండీలను దుండగులు చోరీ చేశారు. మండల కేంద్రంలోని తెనుగుపూడి వెళ్లే రోడ్డు మార్గంలో మరిడిమాంబ ఆలయంలో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. మారేపల్లి పంచాయతీ శివారు శివరామ ఆలయం, చేనులపాలెంలో పరదేశమ్మ ఆలయంలో హుండీలను దొంగలు దోచుకున్నారు. శుక్రవారం ఉదయం భక్తులు ఆయా ఆలయాలకు వెళ్లడంతో హుండీ చోరీలు విషయం వెలుగులోకి వచ్చింది. మూడు హుండీలను దోచుకోవడంపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు. గతంలోనూ మండలంలో చాలా ఆలయాల్లో దొంగతనాలు జరిగాయి.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రాధాన్యత భవనాల నిర్మాణం వేగవంతం

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో చేపట్టిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలలో ఏమైనా సమస్యలుంటే పై అధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పై అధికారుల అనుమతి లేనిదే సెలవుపై వెళ్ళకూడదన్నారు. వారికి కేటాయించిన పనిని నిర్ణయించిన గడువులోగా తప్పనిసరిగా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారి వీరు నాయుడు, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు కొనసాగుతున్న చికిత్స

ప్రజాశక్తి-పాడేరు

పాడేరు మండలంలోని సలుగు పంచాయతీ రాయికోట గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన బొలేరో ప్రమాదంలో 14 మంది గాయాల పాలయ్యారు. బొలెరో వాహనం లోయలోకి దూసుకుపోయి సోలం సూకరాజు అనే గిరిజనుడు అక్కడికక్కడే మృతి చెందిన సంగతి విధితమే. ఈ ప్రమాదంలో గాయపడిన పలువురిని పాడేరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి వైద్య సేవల నిమిత్తం తరలించారు. సలుగు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల నుంచి కూలి పనుల కోసం రాజమండ్రి వలస వెళ్లేందుకు 15 మంది గిరిజనులు బొలెరో వాహనంలో ప్రయాణం అయ్యారు.ఈ ప్రమాదంలో ఎడమ వైపు చాతి పైన తీవ్రంగా గాయపడి కుడి కాలు విరిగిపోయిన ఉలం విశాకులు అనే వ్యక్తిని కేజీహెచ్ కు తరలించారు. ఈ ప్రమాదంలో గాయపడిన మరో 13 మంది గెమ్మెలి ఈశ్వరరావు (26), ఉలం సింహాద్రి (19), సాగర మత్స్య రాజు (28), (32), ఉలం కంఠం రావు(24), తామర్ల రాంబాబు, అల్లంగి కొండమ్మ, తామర్ల బాలమణి, తామర్ల శంకర్, నల్లి నవీన్ కుమార్, నల్లి కొండమ్మ, పాంగి బాలరాజు, డిప్పల ఈశ్వరరావు లకు పాడేరు ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు...

మెడికల్ కౌన్సిల్ సభ్యుడు పరామర్శ

పాడేరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో . చికిత్స పొందుతున్న బొలోరో వాహన ప్రమాద బాధితుల్ని రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ టి.నర్సింగ్‌రావు పరామర్శించారు. విషయం తెలుసుకున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ తమర్భ నర్సింగరావు శుక్రవారం ఉదయం ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని గాయపడిన క్షతగాత్రులను, కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. అధైర్యపడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా 24గంటలూ ప్రత్యేక శ్రద్ధ తీసు కోవాలని వైద్యులకు, సిబ్బందికి నర్సింగరావు సూచించారు.

బోరు పనులను ప్రారంభిస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల

బోరుబావి నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

మండలంలోని మల్లం గజ్జాలమ్మ గుడి వద్ద విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ మంజూరు చేసిన తాగునీటి బోరు నిర్మాణానికి సంబంధించిన పనులను శుక్రవారం విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పాడి రైతులు, భక్తుల అవసరాలకు ఈ బోరును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుదిరెడ్డి దేముడు బాబు, వైసిపి కిసాన్ సెల్ రాష్ట్ర డైరెక్టర్ కొల్లిమల్ల అచ్చినాయుడు, గున్నెంపూడి సర్పంచ్ అప్పారావు, యల్.సింగవరం సర్పంచ్ మధు, కరక సర్పంచ్ రామారావు, తురకలపూడి కోఆపరేటివ్ ప్రెసిడెంట్ భూషణం, మల్లం పాల సంఘం అధ్యక్షులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు : జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీలో మిగిలిన 03 నాన్ ఆఫీసియల్ మెంబర్ (ఎస్సీ ఎస్టీ కులస్తులు వారు మాత్రమే), మూడు (ఎన్జీవో)స్వచంద సంస్థలు నిర్వహిస్తున్న ఇతర కులములు (నాన్ ఎస్సీ ఎస్టీ) వారికి అనధికారి సభ్యులుగా నియమించుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి జి.జగన్నాధరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులుగా దరఖాస్తు చేసుకొనువారు అల్లూరి సీతారామ రాజు జిల్లా వాసులై ఉండాలన్నారు. సంబందిత ఆధారాలు (ఫోటోలు/ప్రత్రములతో సహా) తో వారి పూర్తి బయోడేటా జతపరచి, జిల్లా షెడ్యూల్డ్ కుల సంక్షేమ మరియు సాధికారిత అధికారి, అల్లూరి సీతారామ రాజు జిల్లా అధికారికి ఈనెల 25వ తేదీ లోపు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు : ఫోన్ నెంబర్ కు 8985868068 (సమయం: ఉ: 10 గంటలు నుండి 5 గంటలు వరకు) సంప్రదించాలని కోరారు.

సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ టీషర్ట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 17న నిర్వహించనున్న సంధ్య మెరైన్స్ వైజాగ్ మారథాన్ కార్యక్రమానికి సంబంధించిన టీషర్ట్, మెడల్ ఆవిష్కరణ కార్యక్రమం నగరంలోని నోవోటెల్ హోటల్‌లోగల నాటిక హాల్‌లో జరిగింది. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడలు, పరుగును అందరూ తమ జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. వైజాగ్ మారథాన్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైజాగ్ రన్నర్స్ సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ రాయ్, సంధ్య మెరైన్స్ ఎమ్‌డి ఆనంద్, వైజాగ్ రన్నర్స్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీషర్ట్‌ను ఆవిష్కరిస్తున్న సిపి రవిశంకర్ తదితరులు

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

నాగుల చవితి వేడుకలు శుక్రవారం అనకాపల్లి, విశాఖ జిల్లాల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు దేవరాపల్లి మండలం తారువలోని ఆయన స్వగ్రామంలో సతీసమేతంగా పూజలు నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలో నాగుల చవితి వేడుకలు జరిగాయి. సాయంత్రం పలు గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు నిర్వహించారు. అనకాపల్లిలో పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి విష్ణుమూర్తి దంపతులు తమ వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులతో నాగారాధన గావించారు. స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (డైట్) కళాశాల ఆవరణలోని పుట్ట వద్ద మాజీ మంత్రి వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు కుటుంబ సభ్యులు పాలు పోసి పూజలు చేశారు. ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) కుటుంబం రైల్వే స్టేషన్ సమీపంలోని తమ సొంత పొలంలో పుట్ట వద్ద పూజ చేశారు. కశింకోట, సబ్బవరం, బుచ్చయ్యపేట, సబ్బవరం మండలాల్లోని పలు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి మండలంలోని పలు గ్రామాల్లో నాగుల చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. కోటవురట్ల మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు రైతులు, మహిళలు పంట పొలాలకు వెళ్లి పుట్టల వద్ద పూజలు చేశారు. రోలుగుంట మండలంలోని రోలుగుంట, నిండుగొండ, కంచుగుమ్మల తదితర గ్రామాల్లో సందడి నెలకొంది. . పుట్టల వద్ద బాణసంచా కాల్చి సందడి చేశారు.

పూజలు నిర్వహిస్తున్న ఎంవిఆర్ కుటుంబ సభ్యులు

గంజాయి సాగు, అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

- 11 చెక్ పోస్టులు ఏర్పాటు- డిఐజి హరికృష్ణ

ప్రజాశక్తి-కొత్తకోట:గంజాయి సాగుపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నివారణకు చర్యలు చేపట్టామని విశాఖ రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ తెలిపారు. కొత్తకోట సర్కిల్ పరిధిలో కొత్తకోట, రావికమతం పోలీస్ స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో పలు చోట్ల గంజాయి అక్రమ సాగుపై సిబ్బందితో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. సాగు దారులను గుర్తించి వారికీ గంజాయి సాగుతో కలిగే శిక్షలపై అవగాహన కల్పించామని తెలిపారు. సాగు దారులకు ప్రభుత్వం ఉపాధి కల్పిస్తుందని, ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. గంజాయి రవాణా నివారణకు విశాఖ రేంజ్ పరిధిలో సుమారు నాలుగు ప్రత్యేక చెక్ పోస్టులతో పాటు మరో 11 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. మైనర్ వివాహాల నివారణకుకు పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. ఏడాది కాలంలో సుమారు 50 కేసులు నమోదు చేసి ఫాస్ట్ ట్రాక్ ద్వారా చర్యలు చేపట్టామని డిఐజి తెలిపారు. రేంజ్ పరిధిలో పలు పోలీస్ స్టేషన్ల నిర్మాణం పూర్తి కావచ్చాయన్నారు. మరో కొన్ని నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపామని చెప్పారు. చెడు అలవాట్లకు గురైన యువత పట్ల అప్రమత్తం ఉండాలని సిబ్బందికి సూచించామని తెలిపారు. చెడ్డి గ్యాంగ్ సంచారం పై ప్రత్యేక నిఘా ఉందన్నారు. నాటు సారా తయారీ దారులకు అవగాహన కల్పించి సుమారు 200 మందికి పునరావాసం కల్పించే ఏర్పాటు చేస్తున్నామని డిఐజి వివరించారు. చోడవరం -నర్సీపట్నం బి ఎన్ రోడ్డు మరమ్మత్తుల నిర్మాణంలో జాప్యంతో పలు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రజాశక్తి విలేకరి డిఐజి దృష్టికి తీసుకురాగా రోడ్డు నిర్మాణ కాంట్రక్టర్‌తో మాట్లాడి పనులు వేగ వంతం అయ్యేలా చూడాలని జిల్లా ఎస్పిను ఆదేశించారు. కానిస్టేబుల్

మాట్లాడుతున్న డిఐజి హరికృష్ణ

నియామకాలకు కోర్టు తీర్పు కోసం ఎదురు చూస్తున్నామని డిఐజి చెప్పారు.ఈ కార్యక్రమం లో జిల్లా ఎస్పి కెవి మురళి, అనకాపల్లి డిఎస్పి సుబ్బరాజు, సిఐ సయ్యద్ ఇలియాస్ మహ్మద్, కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు, సురేష్, ఉమా మహేశ్వరరావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు..

గ్రంథాలయాల్లో వివిధ పోటీలు

అనకాపల్లిలో కవులకు సత్కారం

56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని పలు శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.

ప్రజాశక్తి- యంత్రాంగం

కశింకోట : కశింకోట గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు జరిగాయి. విశ్రాంతి ఉద్యోగి నంబా రమణ, ఉపాధ్యాయులు అప్పారావు, రామచంద్రరావు, గ్రంథాలయం అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు. తాళ్ళపాలెం శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయం అధికారి కాండ్రేగులు జగన్ ఆధ్వర్యాన విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు.

మునగపాక రూరల్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణీతులుగా కిల్లాడ ప్రసాదరావు, శివకోటి దుర్గాప్రసాదు వ్యవహరించారు. గ్రంథాలయాధికారి ఎల్వి రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, ఆశాదేవి పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు దేశభక్తి గేయాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణారావు, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : దేవరాపల్లి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఓ.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉషోదయ స్కూల్, కైరాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్, కాశీపురం ఎంపీపీ స్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణీతలుగా కొటాన రాంబాబు, కాటపల్లి సందీప్ కుమార్, ఛాయాదేవి, లావణ్య వ్యవహరించారు.

అనకాపల్లి : స్థానిక శాఖాగ్రంథాలయంలో శుక్రవారం అనకాపల్లి సాహితీమిత్రులచే కవిసమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాహితీమిత్రులు కన్వీనర్ డాక్టర్ యిమ్మిడిశెట్టి చక్రపాణి గ్రంథాలయాలు-సాహిత్యం గురించి ప్రసంగించారు. ప్రముఖ కథారచయిత గొంతిన రంగబాబు నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో కవులు పుస్తకాలు, గ్రంథాలయాలు తదితర అంశాలపై కవితలు, పాటలు వినిపించారు. కార్యక్రమంలో గొంతిన రంగబాబు, రాయవరపు సరస్వతి, రేగురగడ్డ వెంకట లక్ష్మీ, గాయత్రి, జిఎస్‌కె.సాయిబాబా, తదితర కవులను గ్రంథాలయాధికారి కె.శ్రీనివాస్ సత్కరించారు. సమన్వయకర్తగా బళ్ళా నాగభూషణం వ్యవహరించారు. గ్రంథాలయ అధికారులు ఎల్.వి.రమణ, బి.వి.రామప్పారావు, రామారావు, భరణి పాల్గొన్న సభకు కోరాడ అప్పలరాజు వందన సమర్పణ చేశారు.

కోటవురట్ల: స్థానిక గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన, సభ్యత్వ స్వీకరణ నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీడికాడ:శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని ఎంఎస్ఎల్ జోగేశ్వరి మాట్లాడుతూ, ఈ క్విజ్ పోటీలకు చీడికాడ, తురువోలు, ఖండివరం ప్రాథమిక పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారని ఆమె అన్నారు

నక్కపల్లి:మండలంలోని చినదొడ్డుగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. పిడి ఆదిలక్ష్మి పర్యవేక్షణలో విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, మ్యూజికల్ చైర్ వంటి క్రీడా పోటీలను నిర్వహించారు. విజేతలకు ముగింపు కార్యక్రమం రోజున బహుమతులు అందజేయనున్నట్లు జనార్ధన్ తెలిపారు .

గొలుగొండ:శాఖా గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుబాబు మాట్లాడుతూ, గ్రంథాలయాలు వాటి ప్రయోజనాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీలకు గొలుగొండ అంబేద్కర్ గురుకుల విద్యార్థులు 26 మంది హాజరయ్యారన్నారు. అనంతరం పఠన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామనాయుడు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయాల ఉపయోగాలు అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ మహేష్, మాజీ కౌన్సిలర్ ఎం లక్ష్మణరావు పాల్గొన్నారు

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం లైబ్రేరియన్ బి.సూర్యకళ ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహులు, ఉద్యమకారులు ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వైస్ ప్రెసిడెంట్ పెతకంశెట్టి భూలోకరావు, కార్యదర్శి ఆడారి రామకృష్ణ, పెంటకోట గణేష్ పాల్గొన్నారు .

ములగాడ: మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం లైబ్రేరియన్ వి.అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం హృద్యమంగా సాగింది. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి .శ్రీరామమూర్తి 'ఎవరు ఆపగలరు' అనే కవితను, ఈశ్వరరావు 'చదువు'అనే కవితను, పాత్రికేయులు ఎస్.చలపతిరావు 'రండోయ్-రారండోయ్'అనే కవితను, కార్మిక నేతసత్యానందం 'నూతన పోకడలు' అనే కవితను, రచయిత కె.సత్తి రాజు 'మహిళ' అనే కవితను, న్యాయవాది జికెవి. రాజు 'స్వతంత్ర భారతావని' అనే కవితలను చదివి వినిపించారు. వీరిని ఎంఇఒ వెంకటరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి సత్కరించారు. సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్‌వాలంటీర్లు పాల్గొన్నారు .

సెయింట్ ఆన్స్ కాలేజీలో సదస్సు

సెయింట్ ఆన్స్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కాలేజీ లైబ్రేరియన్ జి. శిరీష ఆధ్వర్యంలో 'గ్రంథాలయ ఉద్యమం'పై సదస్సు నిర్వహించారు. చరిత్ర అధ్యాపకురాలు జి. లలిత మాట్లాడుతూ, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు వంటి గ్రంథాలయోధ్యమ ప్రముఖుల సేవలు యువత మరువరాదన్నారు.

రంగసాయి గ్రంథాలయంలో నాటక పుస్తక ప్రదర్శన

సీతమ్మధార : 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ద్వారకానగర్, రైల్వే స్టేషన్ రోడ్, టిఎస్ఆర్. కాంప్లెక్స్‌లోని దేశంలోనే తొలి నాటక గ్రంథాలయం 'రంగసాయి నాటక గ్రంథాలయం'లో ఈనెల 20 తేదీ వరకు, ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నాటకాల పుస్తకాలు, నాటకాల సాహిత్య పుస్తక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. నాటక పుస్తక ప్రదర్శనకు విచ్చేసిన అఖిల భారత అవినీతి నిరోధక సమాఖ్య , ప్రజా సమస్యల పరిశోధన అధికారి బి. క్రాంతి మాట్లాడుతూ ఇటువంటి వినూత్నమైన నాటక గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. నగరానికి చెందిన పలువురు పాత్రికేయులు రంగసాయి నాటక గ్రంథాలయాన్ని సందర్శించి తమ అభిప్రాయాలను తెలియజేస్తూ బాదంగీర్ సాయిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు నాగనబోయిన నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, నాయుడు, మోహన్‌కృష్ణ, ఎల్.జి. నాయుడు, శేషు, అప్పలరాజు, కీర్తన పాల్గొన్నారు.

చీడికాడలో పోటీలకు హాజరైన విద్యార్థులు

అత్యాచార నిందితున్ని అరెస్టు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినతీనార్ల గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు డిమాండ్ చేసారు. శుక్రవారం బాధిత తల్లిదండ్రులని పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, ఈనెల 5న గ్రామానికి చెందిన 12 సంవత్సరాల మైనర్ బాలికపై 50 సంవత్సరాల పై బడిన వ్యక్తి లైంగిక వేధింపులకు, అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. బాధిత బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తెకు న్యాయం చేయాలని కోరుతూ నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి 13 రోజులు అవుతున్నా నిందితుడిని అరెస్టు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పోలీసులు స్పందించి వెంటనే నిందితుడిని అరెస్టు చేసి, ఫోక్స్ చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, బాలిక తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని పెదతీనార్ల పంచాయతీ దొండవాక గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గత మూడు రోజుల నుండి తాగునీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.ముఖ్యంగా మహిళలు మూడు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మైలపల్లి అమ్మోరయ్య, మున్నా, అప్పారావు, జగ్గారావు, కోడ మల్లి తదితరులు పాల్గొన్నారు.

19న వనసమారాధన

ప్రజాశక్తి-గొలుగొండ: అడ్డురోడ్డు నుండి నర్సీపట్నం వెళ్లే రోడ్డులో మామిడి తోట వద్ద ఈ నెల 19న జరిగే కాపు సంక్షేమ సేవ కార్తీక వన సమారాధను విజయవంతం చేయాలని కాపు సంక్షేమ సేన సభ్యులు గండెం దొరబాబు కోరారు. ఈ మేరకు మంలంలోని కృష్ణదేవిపేట, కొంగ సింగి, ఏఎల్‌పురం, లింగంపేట, గాదంపాలెం తదితర గ్రామాల్లో కాపులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేగుబళ్ళ శివ, వాసం వెంకటేష్, లంక సత్యనారాయణ పాల్గొన్నారు.

పంచాయతీ భవనం

అసంపూర్తిగా పంచాయతీ భవనం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో కొడవటిపూడి గ్రామంలో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామ పంచాయతీ కార్యాలయం దాదాపు పది లక్షలతో నిర్మించిన భవనం అసంపూర్తిగా పడి ఉంది. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ వ్యవస్థతో కొత్త భవనం మంజూరు కావడంతో పాత భవనాన్ని అలా అసంపూర్తిగా వదిలేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

మోటార్లతో నీటిని తోడుతున్న రైతులు

పంటను కాపాడుకునేందుకు రైతుల పాట్లు

ప్రజాశక్తి-రోలుగుంట:వర్షాభావ పరిస్థితుల కారణంగా మండలంలో కొంతలం గ్రామంలో వరి పొట్ట దశలోకి రావడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ప్రతీ రైతు వాటర్ ఇంజన్‌తో సుమారు 1000 అడుగుల దూరంలో గల నీటిని పంపుల ద్వారా పొలాలకు అందిస్తున్నారు. ఇన్నాళ్లు పెట్టుబడి పెట్టి చివరి దశలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు ఎకరానికి 30వేల పెట్టుబడి పెట్టినప్పటికీ వాతావరణం అనుకూలించక పోవడంతో నీటి కోసం ఇంజన్ల సాయంతో తోడించుటకు అదనపు పెట్టుబడి అవుతుందని రైతులు వాపోయారు.

చెడ్డీ గ్యాంగ్‌పై అప్రమత్తం

ప్రజాశక్తి-గొలుగొండ:రాష్ట్రంలో దొంగతనాలకు పాల్ప డుతున్న చెడ్డీ గ్యాంగ్ సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేడిపేట ఎస్సై ఉపేంద్ర సూచించారు. శు క్రవారం పోలీసుశాఖ ప్రచురించిన పోస్టర్లను కృష్ణదేవిపేట ఆర్టీసి బస్ స్టేషన్‌తో పాటు పలు చోట్ల అతికించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, గ్రామా ల్లో అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాల న్నారు. ఈ కార్యక్రమ ంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లను అతికిస్తున్న పోలీసులు

భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -అనంతగిరి:మండల కేంద్రంలోని నూతన పెట్రోల్ బంక్ సమీపంలో రైతు కూలీ ఉత్పత్తి సంఘం భవనం నిర్మించేందుకు ఎంపీపీ శెట్టి, నీలవేణి, స్థానిక సర్పంచ్ సోమ్మెల రూతు శంకుస్థాపన చేశారు. అనంతరం సర్పంచ్, ఎంపీపీ లు మాట్లాడుతూ, ప్రభుత్వం రైతు కూలీ ఉత్పత్తిల సంఘం భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిం దన్నారు. పనులను మరింత వేగవంతం చేసి భవనం పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్. నాగులు వెలుగు సీసీలు ఆనంద్, త్రినాథ్, అప్పలరాజు, అకౌం టెంట్ ప్రీతి సిబ్బంది దిలీప్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతంపై కన్ను

-గ్రామ కంఠం భూమి ఆక్రమణ - దర్జాగా ఫామ్ హౌస్ నిర్మాణం -పట్టించుకోని రెవెన్యూ అధికారులు

అక్రమంగా నిర్మించిన ఫామ్ హౌస్

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో కృష్ణభట్ల అగ్రహారం రెవెన్యూ గ్రామానికి సంబంధించి సర్వే నెంబర్14 రెవెన్యూ కొండ విస్తీర్ణం 67.45 ఎకరాల గ్రామ కంఠం కొండ ఆక్రమణకు గురవుతుంది. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. దీంతో, ఇదే అదునుగా భావించిన మాజీ జిల్లా నాయకుడు, ప్రస్తుత వైసిపి నాయకుడు రాజా సాగి రామచంద్ర రాజు కొండ ప్రాంతం సమీపంలో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో దర్జాగా ఫామ్ హౌస్ నిర్మాణం చేపడుతున్నారు. కొండ ప్రాంతం అంతా తనదేనని ఎవరు ఆ ప్రాంతంలోకి ప్రవేశించకూడదని ప్రత్యేకంగా గేటు ఏర్పాటు చేసుకున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. సదరు కొండ ప్రాంతం భూమి సమీపంలో గతంలో ఇనాం భూమిగా ఉండేది. ప్రస్తుతం ఇనాం భూమికి ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారు. ఇనాం భూమిగా ఉన్న సమయంలోనే ఈ జిల్లా నాయకుడు కొండ ప్రాంతం భూమిపై కన్నేసి రైతుల నుంచి కొంత ప్రాంతం భూమిని కొనుగోలు చేశారు అప్పటికే రైతులు ఆ కొండ ప్రాంతంలో పశువుల పాకలు నిర్మాణాలు చేపట్టుకొని కొండ ప్రాంతం పై ఆధారపడి జీవనం కొనసాగించేవారు.ప్రస్తుతం ఆక్రమణకు గురైన కొండ ప్రాంతంలోకి కేబి అగ్రహారం గ్రామస్తులను (అనకొండ) పశువులను మేకలను మేపుకొనుటకు కూడా రానివ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీప ప్రాంతంలో లాలం వెంకటరావు, కారు రామునాయుడు, పేజర్ల వీర వెంకట సత్య జ్యోతి, రాజాసాగి రామచంద్రరాజు, కల్లేపల్లి కాశీ విశాలాక్షి తదితరు రైతులు ఉన్నారు.కొండ ప్రాంతం భూమిపై విద్యుత్తు లైన్లు ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం పైనా సందేహాలు ఉన్నాయి. సామాన్యుడు ఇల్లు కట్టుకునేందుకు అధికారులు నానా అవస్థలు పెడుతున్న తరుణంలో కొండపై దర్జాగా స్లాబ్ ఇల్లు, స్విమ్మింగ్ పూల్, పార్కును తలపించే విధంగా ఫామ్ హౌస్ ఏర్పాటు చేసుకున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విశేషం.

ఫామ్ హౌస్ ప్రవేశ ద్వారం

ఫామ్ హౌస్‌లో స్విమ్మింగ్ పూల్

ఆక్రమణలు ఏమైనా ఉంటే పరిశీలిస్తాం

ఈ విషయంపై ఉప తహసిల్దార్ సోమశేఖర్ ను వివరణ కోరగా.. ఆక్రమణలు ఏమైనా ఉంటే పరిశీలించి ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసు కుంటామన్నారు.

శిలాఫలకం వేశారు.. రోడ్డు వేయడం మరిచారు

- తవ్వి విడిచిపెట్టడంతో రాళ్లు తేలిన రోడ్డు
-అవస్థలు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట:మండలంలోని కశింకోట, బంగారు మెట్ట రోడ్డు నుండి పెదమది న - గున్నెంపూడి, పిల్లవానిపాలెం, ఆర్ఇసి రోడ్డు వరకు తారు రోడ్డు నిర్మాణానికి జెసిబితో తవ్వి విడిచిపెట్టడంతో వాహనదారులు, పాదచారుల అవస్థలు అన్నీ ఇన్ని కావు. ఈ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేయడానికి ఈ ఏడాది ఆగస్టులో స్థానిక శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పెదమదిన జంక్షన్ వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించి వెను వెంటనే జెసిబితో రోడ్డు పనులు ప్రారంభించారు. వెనువెంటనే జెసిబిలతో సదరు జంక్షన్ నుండి గున్నేంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు సుమారు ఏడు కిలోమీటర్ల రోడ్డును పూర్తిగా తవ్వి విడిచిపెట్టారు. దీంతో, రోడ్డంతా రాళ్లమయంగా మారింది. కనీసం వాహనాల రాకపోకలకు ఏమాత్రం అవకాశం లేకుండా రాళు తేలి వాహనాల రాకపోకలకు ఏమాత్రం అవకాశం లేకుండా మారింది. గత రెండున్నర నెలలుగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో గొయ్యిలు ప్రస్తుతం రోడ్డంతా రాళ్లుగా మారింది. ఈ రోడ్డు గుండా ప్రతిరోజు రావికమతం, బుచ్చయ్యపేట మండలంలోని గున్నెంపూడి, కొండపాలెం, ఏపీ అగ్రహారం, పెద్దమదినా, చిన్న మదిన, తదితర గ్రామాల నుండి వందలాదిమంది ప్రతిరోజు బైకులు, ఆటోలపై అనకాపల్లికి ప్రయాణాలు సాగిస్తుంటారు. వీరికి ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే నరకంగా మారింది.

రోడ్డుపై తేలిన రాళ్లు, గోతులతో పలు వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇటీవల విశాఖ డెయిరీ పాల కేంద్రాల నుండి బుచ్చయ్యపేట బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ కు పాలకేన్లతో వస్తున్న ఆటో ముందు చక్రం విరిగిపోయి రోడ్డుపై ప్రమాదానికి గురైంది. పనులను పూర్తిస్థాయిలో ప్రారంభించి రోడ్డును వేయాలని జనసేన ఆధ్వర్యంలో ఇటీవల ఆందోళన చేపట్టారు. అధికారులు పట్టించుకోలేదని నాయకలు, ప్రయాణికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధం అవుతున్నారు.

ఎమ్మెల్యే ధర్మ శ్రీ ప్రారంభించిన శిలాఫలకం

తవ్విన రోడ్డుపై తేలిన రాళ్లు

రోడ్డు పనులు చేపట్టాలి

ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే భయంగా ఉంది. పెద్దపెద్ద గోతులు, రోడ్డంతా రాళ్లతో ఉండడం భయంగా ఉంది. రోడ్డును తవ్వకుండా ఉన్నా సరిపోను. ఈ రోడ్డు అంటేనే భయం గా ఉంది.

ముచ్చకర్ల నాయుడు, గున్నెంపూడి

దళిత యువకునిపై కత్తితో దాడి

-డిఎస్‌పి విచారణ
-దళిత నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - కొత్తకోట:దళిత యువకునుపై ఓ సామాజిక వర్గానికి చెందిన నలుగురు వ్యక్తులు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన రావికమతం మండలం మర్రివలస గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనకు ప్రత్యక్ష సాక్షి, యువకుని తల్లి వారా రమణమ్మ తెలిపిన తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి.. గ్రామానికి చెందిన దళిత యువకుడు వారా కన్నయ్య (నాయుడు) (25) తో ఇదే గ్రామానికి చెందిన తమిరెడ్డి వంశీ గత కొన్నాళ్ళు పాటు స్నేహంగా ఉండే వారు. ఇరువురు మధ్య కొన్నాళ్ళు కిందట స్వల్ప తగాదా చోటు చేసుకుంది. దీంతో కన్నయ్య కొంతకాలంగా బొడ్డేపల్లిలో కూలి పనులకు వలస వెళ్ళాడు. నాగుల చవితి పండగ సందర్బంగా గురువారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో కన్నయ్య ఇంటికి వచ్చాడు. ఇది తెలుసుకున్న తమిరెడ్డి వంశీ కన్నయ్య ఇంటికి వెళ్ళాడు. భోజనం చేస్తూన్న కన్నయ్యను కులం పేరుతో దుషిస్తూ సమీప అంగన్వాడీ భవనం వద్దకు బలవంతంగా లాక్కొని వచ్చాడు.. అప్పటికే సిద్ధంగా ఉన్న మరో ముగ్గురు వ్యక్తులు ఎలిశెట్టి వరహాలు బాబు, ఆమిరెడ్డి జగన్నాధం, ఏలిశెట్టి రాముడు తదితరులు కన్నయ్యపై దాడికి పునుకున్నారు. కన్నయ్యపై యువకుడు వంశీ విచక్షణా రహితంగా కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అడ్డుకోబోయిన తల్లి రమణమ్మ, సోదరుడు నాగేష్‌లను చేతులు వెనకకు కట్టి పట్టు కొని వారిని కూడా బెదిరించారు. తీవ్రంగా గాయ పడిన కన్నయ్యను స్థానిక ఆటో డ్రైవర్ సాయంతో నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కెజిహెచ్ కు తరలించారు. బాధితుని సోదరుడు వారా నాగేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తకోట ఎస్ఐ లక్ష్మణ రావు కేసు నమోదు చేసి అనకాపల్లి డిఎస్‌పికి సమాచారం అందించారు. ఈ సంఘటనపై డిఎస్ పి విచారణ చేపడుతున్నారు.

దళిత నాయకుల పరామర్శ

.దళిత యువకుడు వారా కన్నయ్య (నాయుడు)పై దాడి చేసిన వ్యక్తులపై తక్షణమే చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎస్సి, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోన్టిరింగ్ కమిటీ జిల్లా మెంబర్ మార్తి అప్పల రాజు, నర్సీపట్నం డివిజన్ మెంబర్ చిట్ల చలపతి, రెల్లి హక్కుల సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షులు వై పాపారావు, కెవిపిఎస్ కార్యదర్శి చిరంజీవి, ఏఐ ఎం నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు చేబ్రోలు సల్మాన్ రాజు, కార్యదర్శి కిడారి మల్లేష్ తదితరులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం రావికమతం మండలం మర్రివలస గ్రామంలో బాధిత కన్నయ్య కుటుంబాన్ని వారు పరామర్శించారు. పరామర్శించిన వారిలో దళిత నాయకులు బి. బుల్లిబాబు, అల్లం ఈశ్వరరావు, నాగేశ్వరరావు, యాదగిరి అప్పలనాయుడు, మరువాడ అర్జునరావు ఉన్నారు..

ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

డిఎస్‌పి విచారణ

దళిత యువకుడు వారా కన్నయ్య పై దాడి నేపథ్యంలో అనకాపల్లి డిఎస్‌పి సుబ్బరాజు శుక్రవారం సాయంత్రం విచారణ చేపట్టారు. యువకుని తల్లి వారా రమణమ్మ ను సంఘటన వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధిత సోదరుని నాగేష్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నంతో పాటు ఎస్సి, ఎస్టీ కేసు నమోదు చేస్తామన్నారు. కుటుంబానికి రక్షణ కల్పించడంతో పాటు బాధితునికి మెరుగైన వైద్య సేవలు అందించే ఏర్పాటు చేశామని తెలిపారు. గ్రామంలో పోలీస్ పీకేట్ ఏర్పాటు చేసి ఇరు వర్గాలతో శాంతి కమిటీ ఏర్పాటు చేస్తూన్నట్టు ప్రకటించారు. ఆయన వెంట కొత్తకోట ఎస్ ఐ లక్ష్మణ రావు తదితరులు ఉన్నారు.